# ఒక ప్రణయ కధ

[గల్పిక]

మావాడి ప్రణయ కథలో నేను జోక్యం కలిగించుకోకుండా ఉండాలని చాలా ప్రయత్నించాను. కాని సూర్యమే నన్ను బలవంతంగా అందులోకి లాగాడు; నెలరోజులు ఆలోచించి మరీ రాసిన తన ప్రణయలేఖ చూపించాడు :

“కమలా, నన్ను వివాహం చేసుకొనటానికి నీ కేమన్నా అభ్యంతరం ఉందా?

‘నీకీ ఉత్తరం రాయకుండా ఉండాలని నెల్లాళ్ళనించీ ప్రయత్నిస్తున్నాను. లాభం లేకపోయింది. నిన్ను కోరకుండా ఉండాలని నేను చేసిన ప్రయత్నమంతా వృధా అయిపోయింది.

“నన్నే అడిగితే, నాకన్న అన్ని విధాలా మంచి వాణ్ణీ, అందమైనవాణ్ణీ, ధనికుణ్ణీ, తెలివి గలవాణ్ణీ, పెళ్ళాడమని సలహా ఇస్తాను—సూర్యం.”

“ఎట్లా ఉంది ఉత్తరం?” అన్నాడు సూర్యం.

నేనాలోచించి, “నీలాగే ఉంది. పోస్టులో వేసిచూడు.” అన్నాను.

దానికి వచ్చిన సమాధానం కూడా మావాడు నాకు చూపాడు. నన్నా జవాబు పైకి చదవమన్నాడు.

“సూర్యంగారూ, మీ ఉత్తరం గురించి ఏమనుకోవాలో నాకు తెలీదు. నన్ను మీరవమానం చెయ్యటానికి ప్రయత్నిస్తున్నట్టు భావిస్తున్నాను. మీరింకా మంచిగా, అందంగా,

ధనికులుగా, తెలివిగా లేనందువల్ల మిమ్మల్ని పెళ్ళాడలేను-
కమలాదేవి.''

నేనా ఉత్తరం పూర్తిచెయ్యగానే సూర్యం విరగబడి నవ్వసాగాడు. వాడికి మతి చెడిందని నా కనుమానం తగిలింది. ఎందుచేతంటే వాడు కమలను ప్రేమించాడు, తన ప్రేమను విమర్శించుకున్నాడు, దాని బలాన్ని పరీక్షించి, అది గట్టిప్రేమే నని నిర్ణయించుకున్నాడు. అట్లాంటి ప్రేమ ఇట్లా పరిణమించినందుకు నాకు విచారం వేసింది.

నేను వాడిభుజంతట్టి, ''ఫరవాలేదులేరా, ఓ నెల్రోజుల్లో నువ్వా అమ్మాయిని మరిచిపోతావు—కాస్త ప్రయత్నిస్తే'' అన్నాను.

వాడింకా నవ్వసాగాడు.

''ఆ పశువునా?'' అన్నాడు నవ్వుతూనే ''దానికోసం నెల్రోజు లకారణంగా హైరాను పడ్డాను. చెప్పుతో కొట్టక సముదాయిస్తావేం?''

నా గుండెమీది బరువు తీసేసినట్టయింది.

తరవాత రెండు నెల్లకు కాబోలు కమల వివాహం అయింది. ఆమెభర్త కొత్తగా ఐ.సి.ఎస్. పరీక్ష పాసయి ఎక్కడో డిప్టీకలెక్టరుగా ప్రవేశించాడు. చూపులకు దొరల్లేనే ఉంటాడు.

మా సూర్యంలో కలిగినమార్పు నేను నాలుగైదు రోజుల అనంతరం గాని గమనించలేదు. వాడాహార నిద్రలు విసర్జించాడు. వాడి నవ్వు విని ఎన్నో సంవత్సరా లయినట్టుంది. వాణ్ణి చూస్తేనే భయం వెయ్యసాగింది.

"ఏమిట్రా, సూర్యం?" అన్నాను.

"ఆ కమల——" అన్నాడు.

"ఆ కమలమీాద నీకు మళ్లా వ్యామోహం కలిగిందా ఏమిటి?" అన్నా ఆశ్చర్యంతో.

సూర్యం తల అడ్డంగా తిప్పాడు.

"కమల అన్నమాట నిజం. ఆ ఉత్తరం రాసి నేనావిణ్ణి అవమానించాను."

"అప్పట్లో నువ్వట్లా అనుకోలేదే!"

"అప్పటికది అవమానం కాదు. ఈ పెళ్ళివల్ల అది అవమానంగా పరిణమించింది."

"ఎట్లా?"

"కమల కెటువంటి మొగుడు దొరికాడో చూడు! కమలని ప్రేమించటానికి గాని ప్రేమించానని చెప్పి ఉండటానికి గాని నాకే మధికారం ఉంది?"

"కమలను పశువన్న వాడివి కాదూ?"

"అప్పుడు——నాకు సమాధానం రాసినప్పుడు కమల పశువే!"

సూర్యానికి నిజంగా పిచ్చి ఎత్తిందనే ఇప్పటికీ నా విశ్వాసం......